క్లుప్తంగా

కూరగాయల సాగులో సస్యరక్షణపై అవగాహన

నల్లజర్ల: వైఎస్సార్ ఉద్యాన యూనివర్సిటీ బోధన సిబ్బంది తెలికిచెర్లలో ఎస్సీ రైతుల ఆధ్వర్యంలో కూరగాయల సాగులో సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. కూరగాయల పెంపకం, సస్యరక్షణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం డ్రోన్ సాయంతో క్రిమిసంహారక మందులు ఏవిధంగా పిచికారీ చేయాలో ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ సైంటిస్టులు డాక్టరు ఇమ్మానియేలు, డాక్టరు సీహెచ్ చెన్నకేశవులు, వి.శేఖర్, ఉద్యాన అధికారి బబిత, గ్రామ ఉద్యాన సహాయకులు బి.సురేష్, ఉద్యాన కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

ధనమ్మ తల్లి ఆలయ ముఖద్వారం ప్రారంభం

తాళ్లపూడి: వేగేశ్వరపురం పంట పొలాల్లో వెలసిన ధనమ్మ తల్లి ఆలయానికి వెళ్లే మార్గంలో నూతనంగా నిర్మించిన ముఖద్వారాన్ని బుధవారం ప్రారంభించారు. సర్పంచ్ కొమ్మిరెడ్డి సరశురామారావు చేతుల మీదుగా ముఖద్వారాన్ని ప్రారంభించారు. వేదపండితులు పూజలు చేశారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో బల్లిపాడు సర్పంచ్ ఎల్లిన శివరామకృష్ణ, నామన పరమేశ్వర రావు, మద్దుకూరి రాంబాబు, సింహాద్రి జనార్దనరావు, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన

నిడదవోలు: స్థానిక ఎస్టీ కాలనీలో పురాతన కోదండ రామాలయం పునఃనిర్మాణానికి బుధవారం మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, ఎమ్మెల్యే తనయుడు జి.వరుణ్‌సాయి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దిరెడ్డి దాసరి పెద్ద సుంకయ్య, పూజారి చిన్న రామయ్య, జగన్నాథ నాగయ్య పూజారి నరసయ్య, దాసరి సోమయ్య కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల ధర్నా

నిడదవోలు: మధ్యంతరం భృతి వెంటనే ప్రకటించాలని, పీఆర్సీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం తాలూకా జేఏసీ చైర్మన్ కె.నందీశ్వరుడు ఆధ్వర్యంలో వివిధ సంఘాల ప్రభుత్వ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. అనంతరం రెవిన్యూ అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయకర్, తాలూకా జేఏసీ కార్యదర్శి జే. జయంత్, జేఏసీ కోశాధికారి జి.రాంబాబు, కల్యాణ్ కృష్ణ, ఎం.సురేష్, అరుణ్ కుమార్, ఐ.శ్రీనివాస్, ఎస్.భీమారావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల బంద్‌ను విజయవంతం చేయాలి

కొవ్వూరు: కార్మిక సంఘాలు, కిసాన్ సంయుక్త మోర్చా పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా శుక్రవారం నిర్వహించ తలపెట్టిన పారిశ్రామిక గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని ప్రగతి శీల కార్మిక సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు ఎస్కే మస్తాన్ కోరారు. బుధవారం ఐ.పంగిడి గ్రామంలో బంద్ కరపత్రాలను ఆవిష్కరించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, కార్మిక చట్టాల రద్దును వ్యతిరేకిస్తూ ఈ బంద్ చేపట్టనున్నట్టు చెప్పారు. క్రషర్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు గంటా కృష్ణ, ఐఎఫ్‌టీయూ నాయకులు పి.నాగేశ్వరరావు, నాగరాజు, దుర్గరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం

నిడదవోలు: ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యం అందుతోందని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. పట్టణంలోని చర్చిపేట సచివాలయంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. అనంతరం రోగులకు మందుల కిట్లను ఆయన పంపిణీ చేశారు. ఎన్టీఆర్ కాలనీ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిధిలో డాక్టర్ ప్రసన్నకుమార్ నేతృత్వంలో వైద్యుల బృందం వివిధ విభాగాల్లో 375 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్, కౌన్సిలర్లు గుర్రం శాంతిశ్రీ, ముగ్గండి మాణిక్యమాల, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా గీతాపారాయణ

కొవ్వూరు: గోష్పాదక్షేత్రంలోని సుందర షిర్డి సాయి ఆలయం 29వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా బుధవారం సంపూర్ణ భగవత్ గీతాపారాయణం నిర్వహించారు. ఉదయం సాయి నాథుడికి అభిషేకాలు, పూజలు చేశారు.

అన్ని వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



కాపవరంలో ఎస్సీ కమ్యూనిటీ హాలును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

- ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు
- ఎస్సీ కమ్యూనిటీ హాలు ప్రారంభం
- బీసీ కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన

పెరవలి: అన్ని వర్గాల అభ్యున్నతి కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు పేర్కొన్నారు. కాపవరంలో బుధవారం రూ.3.20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాలును ప్రారంభించగా, రూ.5 లక్షలతో నిర్మించనున్న బీసీ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కాపవరం గ్రామంలో ఇప్పటివరకు రూ.9.45 కోట్ల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులు, పథకాల ద్వారా రూ.25.69 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేశామన్నారు. నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరమళ్ళ సత్యనారాయణ, సర్పంచ్ బంటుమిల్లి రత్నాజీరావు, ఎంపీటీసీ సభ్యులు మెర్ల వెంకటేశ్వరరావు, పార్టీ అధ్యక్షుడు మెర్ల భవానీ వైఎస్సార్ సిపి నాయకులు, జక్కంశెట్టి సుబ్బారావు, యార్లగడ్డ ఏవిఎల్ రాజు వివిధ గ్రామాల సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం

రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి పేద విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తోందని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు పేర్కొన్నారు. పెరవలి, కారపర్రు ఉన్నత పాఠశాలల్లో బుధవారం 135 మంది ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ నాడు–నేడు ద్వారా నియోజక వర్గంలో పాఠశాలలకు ఇప్పటి వరకు రూ.272.76 కోట్లు ఖర్చు చేశామన్నారు. నిడదవోలు నియోజకవర్గంలో 33 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉండగా వీటిలో 8 వతరగతి చదువుతున్న విద్యార్థులు 1973 మంది ఉన్నారని వీరితో పాటు, ఉపాధ్యాయులను కలిపి 2245 ట్యాబ్‌లు అందిస్తున్నామన్నారు. ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వీరమళ్ల సత్యనారాయణ, సర్పంచ్‌లు గుబ్బల ఆదిలక్ష్మి, గంగోలు సీతమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు రాంపండు, పంపన అంజి, నామన అంజిబాబు, కాపకా సురేంద్ర, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అగ్రవర్ణాల్లో పేదలను గుర్తించింది జగనన్న

రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత



యాదవోలు సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వనిత, వేదికపై పార్లమెంటరీ ఇన్‌చార్జి శ్రీనివాస్

దేవరపల్లి: అగ్రవర్ణాల్లోని పేదలకు గుర్తించి ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అందిస్తున్నారని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. దేవరపల్లి మండలం యాదవోలు, దేవరపల్లిలో బుధవారం రాత్రి పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఎన్నికల సమాయత్తం సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాలకు పార్టీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్ అధ్యక్షత వహించగా మంత్రి తానేటి వనిత ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మరొక రెండు నెలల్లో జరగనున్న ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి, గూడూరి శ్రీనివాసరావుకు, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు ఫ్యాన్ గుర్తుపై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు. పార్లమెంటరీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత టీడీపీ పరిపాలనకు, ప్రస్తుత వైఎస్సార్ సీపీ పరిపాలనకు మధ్య గల వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని ఆయన కోరారు. గ్రామంలోని దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి, మదర్ థెరీస్సా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తొలిసారిగా గ్రామానికి వచ్చిన మంత్రి వనిత, గూడూరి శ్రీనివాసరావుకు పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు, సర్పంచ్ కడిమి వీరకుమారి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు ఎం.గంగరాజు, సొసైటీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి అనిశెట్టి సూర్యనారాయణ, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి ఆచంట అనసూయ, మండల యువజన విభాగం అధ్యక్షులు అనిశెట్టి సూర్యచంద్రరావు, మండల సచివాలయాల కన్వీనర్ కుసులూరి వెంకటసతీష్, మైనార్టీ సెల్ అధ్యక్షులు ముస్తాఫా, కవల శ్రీనివాస్, ఎంపీటీసీ, నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యం

పరిచయ కార్యక్రమంలో ఎమ్మెల్యే, కొవ్వూరు నియోజకవర్గం ఇన్‌చార్జి తలారి వెంకట్రావు



బ్రాహ్మణగూడెంలో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

చాగల్లు: ఎన్నికల సమీపిస్తున్నందున గ్రామ స్థాయిలో వైఎస్సార్ సీపీ మరింత బలోపేతం చేసి గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని ఎమ్మెల్యే, కొవ్వూరు నియోజకవర్గం ఇన్‌చార్జి తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని బ్రాహ్మణగూడెంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కేతనపల్లి శ్రీనివాస్ నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలన సాగుతోందని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను సంపూర్ణంగా అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చరిత్ర పుటల్లోకి ఎక్కారన్నారు. అలాంటి నాయకుడు మనకు అవసరమని జగనన్నను మళ్లీ సీఎంగా ఎన్నుకుందామన్నారు. సమావేశంలో ఎంపీపీ మట్టా వీరస్వామి, జెడ్పీటీసీ సభ్యులు గారపాటి విజయ దుర్గ శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, ఎంపీటీసీ ప్రత్తిపాటి వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ సుబ్బారావు, సూర్యనారాయణ, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు

కొవ్వూరు: కుల, మతాలు, పార్టీలకు అతీతంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఎమ్మెల్యే, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు పేర్కొన్నారు. బుధవారం 16వ వార్డు ఔరంగబాద్‌లో నాయకులు, కార్యకర్తల పరిచయ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, మున్సిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, శ్రీరామ సొసైటీ అధ్యక్షుడు అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, చాగల్లు ఎంపీపీ మాట్టా వీరాస్వామి, కౌన్సిలర్‌లు కంఠమణి రమేష్, బత్తి నాగరాజు, నాయకులు మెరిపే వీర్రాజు, రాచర్ల రవీంద్ర, పుల్లూరి సూర్యనారాయణ, పాకా మోహన్‌రావు, బోడపాటి హనుమంత రావు, కాస్కాని వడ్డికాసులు, పుల్లూరి వెంకటేశ్వరరావు, పాకా వంశీ, బోడపాటి హనుమంత రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో చెరగని స్థానం

- ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు
- జీడిగుంటలో గడప గడపకూ మన ప్రభుత్వం

నిడదవోలు రూరల్: పేదలకు సంక్షేమ పథకాలు అందించి రాష్ట్ర ప్రజల్లో గుండెల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెరగని స్థానం సంపాదించుకున్నారని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. జీడిగుంట గ్రామంలో సర్పంచ్ మొక్కరాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు 57 నెలలుగా అందిన సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్‌లెట్‌లను అందజేశారు. జీడిగుంట గ్రామంలో రూ.29.23 కోట్ల సంక్షేమ పథకాలు, రూ.3.97 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, సొసైటీ అధ్యక్షులు శీలంశెట్టి సూర్యనారాయణ, యాళ్ల రామారావు, ఉప సర్పంచ్ ఊబా గోతియ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు పులుమంతుల రామారావు, శ్రీరాములు గంగరాజు, భోగిరెడ్డి వరప్రసాద్, పంచాయతీ కార్యదర్శి కేవీ సుబ్బన్న సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రసాద్

పెరవలి: జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని లంకమాలపల్లి ఎంపీటీసీ సభ్యుడు బొకే వెంకటేశ్వర్లు విద్యుత్ అధికారులను నిలదీశారు. స్థానిక మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం బుధవారం మధ్యాహ్నం ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. లంకమాలపల్లి, ఖండవల్లి గ్రామాల్లో లే అవుట్ల ఏర్పడి రెండేళ్లు అవుతున్నా ఇంత వరకూ విద్యుత్‌సదుపాయం కల్పించలేదని ఎన్నిసార్లు చెప్పినా ఏర్పాటు చేయడంలేదని, అక్కడ ఇళ్లు నిర్మించుకోవద్దా అంటూ నిలదీసారు. దీనితో సమాధానం చెప్పటానికి విద్యుత్ అధికారులు నీళ్ల నమిలారు. అనంతరం అన్ని శాఖల అధికారులు తమ పరిధిలో అభివృద్ధి సభలో వివరించారు. ఎంపీపీ కార్చెర్లప్రసాద్ మాట్లాడుతూ పెరవలి మండల పరిషత్ నిధుల నుంచి 44 పనులు చేయటానికి రూ.65.05 లక్షలు కేటాయించామని దీనితో సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కె.హిమ మహేశ్వరి, సూపరింటెండెంట్ రమేష్, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

పందిరిరాటకు పూజలు చేసిన మంత్రి వనిత



రాటపూజ చేస్తున్న మంత్రి తానేటి వనిత

దేవరపల్లి: యర్నగూడెం గ్రామంలో మార్చి 25న జరగనున్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి బుధవారం పందిరి రాట మూహూర్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనిత చేతుల మీదుగా జరిగింది. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం శ్రీవారి కల్యాణం నిర్వహించనున్నారు. గ్రామస్తుల సహకారంతో ప్రముఖ యువ పారిశ్రామిక వేత్త శ్రీకాకొళపు కాశీవిశ్వనాథం సుమారు రూ.1150 కోట్ల వ్యయంతో అలివేలు మంగ, పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయం నిర్మిస్తున్నట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీకాకొళపు వెంకటనరసింహారావు, పారిశ్రామిక వేత్త శ్రీకాకొళపు కాశీకృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే కుమారుడు వరుణ్‌సాయి, కౌన్సిలర్లు

నిడదవోలు: ప్రజలందరికీ కార్పొరేట్ వైద్యం అందాలనే ఉద్దేశంతో ప్రతీ ఒక్కరికి ఆరోగ్య భరోసా కల్పించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచుతూ ప్రజలకు ఆరోగ్య అభయం అందించారని ఎమ్మెల్యే కుమారుడు జి.వరుణ్‌సాయి అన్నారు. పట్టణంలోని 4వ వార్డులో బుధవారం ఆయన లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ డిజిటల్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, కౌన్సిలర్లు గోపిరెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి మహిళా క్రికెట్ జట్టుకు అభినందన



క్రికెట్ జట్టు సభ్యులతో కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్ భరత్

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): ఆడుదాం ఆంధ్రా పోటీల్లో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచిన దేవరపల్లి సచివాలయం-1 మహిళా క్రికెట్ జట్టు ఎందరికో స్ఫూర్తిగా నిలిచిందని కలెక్టర్ కె.మాధవీలత, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ అన్నారు. కెప్టెన్ చింతపల్లి కవిత నేతృత్వంలో ఆ జట్టు సభ్యులు బుధవారం కలెక్టర్‌ను కలిశారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు ముఖ్యమంత్రి జగన్ ఆడుదాం ఆంధ్ర పోటీలు నిర్వహించారన్నారు. మహిళలు సాధించిన విజయం ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. ఇందులో కోచ్‌ల కృషి, శ్రమ అభినందనీయమన్నారు.

వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నిడదవోలు రూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో ఖాళీగా ఉన్న నాలుగు వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ జేఏ ఝాన్సీ బుధవారం తెలిపారు. అట్లపాడు (ఓసీ, మహిళ), గోపవరం (బీసీ జనరల్), మునిపల్లి (జనరల్), సమిశ్రగూడెం-2 (ఎస్సీ జనరల్)ల కేటగిరికి చెందిన పదో తరగతి ఉత్తీర్ణత సాధించి అభ్యర్థులు ఈనెల 17వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

దివ్యాంగుల ఆశ్రమానికి ఆర్థిక సాయం



దివ్యాంగుల ఆశ్రమంలో వృద్ధులకు వస్త్రదానం, అన్నదానం చేస్తున్న ఆనంద్ స్వరూప్

నల్లజర్ల: చీపురుగూడెం గ్రామానికి చెందిన వసంతాడ సూరయ్య మాస్టారు వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు, ప్రొఫెసర్ ఆనంద్ స్వరూప్ బుధవారం గొల్లగూడెంలోని దివ్యాంగులు, వృద్ధుల ఆశ్రమంలో వృద్ధులు, వికలాంగులకు వస్త్రదానం, అన్నదానంతో పాటు ఆశ్రమ నిర్వహణకు కొంత నగదు ఆశ్రమ ఫౌండర్ కాగిత భాస్కరావుకు అందజేసినట్టు ఆనంద్ స్వరూప్ తెలిపారు. ఆనంద్ స్వరూప్ చేస్తున్న సామాజిక కార్యక్రమాలను పలువురు అభినందించారు.

శ్యామలాదేవికి డాక్టరేట్



శ్యామలాదేవికి డాక్టరేట్‌ను ప్రదానం చేస్తున్న హోప్ థియోలాజికల్ యూనివర్సిటీ

దేవరపల్లి: కృష్ణంపాలెంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మెమోరియల్ ట్రస్ట్ వృద్ధాశ్రమం వ్యవస్థాపక చైర్‌పర్సన్ జి.శ్యామలాదేవికి డాక్టరేట్ లభించింది. 2015 జనవరి 3న ఆశ్రమం స్థాపించి అనేక మంది అనాథ వృద్ధులు, దివ్యాంగులను హక్కున చేర్చుకుని సేవలు అందిస్తున్నారు. ఈమె సేవలను గుర్తించిన హైదరాబాద్‌లోని హోప్ థియోలాజికల్ యూనివర్సిటీ ఈ నెల 2న డాక్టర్ ఆఫ్ బెస్ట్ సోషల్ సర్వీస్ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా బుధవారం ఆశ్రమం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జి.శ్యామలాదేవి మాట్లాడారు. సుమారు ఎనిమిది సంవత్సరాల నుంచి ఆశ్రమంలో 50 మంది వృద్ధులకు, దివ్యాంగకులను ఆశ్రయం కల్పించి ఉచితంగా భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తున్నట్టు ఆమె తెలిపారు. ప్రస్తుతం ఆశ్రమంలో 25 మంది వృద్ధులు, దివ్యాంగులు ఉన్నట్టు ఆమె చెప్పారు. దాతల సహకారంతో ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గతంలో మహాత్మాగాంధీ నేషనల్ ఎక్సలెంట్ అవార్డు, సావిత్రిబాయి పూలే నేషనల్ ఫెలోషిప్ అవార్డు, గుడ్ సమరిటన్ సంస్థ (విజయవాడ) నుంచి ఉత్తమ అవార్డును అందుకున్నట్టు ఆమె చెప్పారు. లాభాపేక్ష లేకుండా ఆశ్రమాన్ని నడుపుతున్నట్టు ఆమె చెప్పారు. ఆశ్రమానికి సహకరిస్తున్న దాతలు, డాక్టరేట్ ప్రదానం చేసిన యూనివర్సిటీకి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

తప్పులు లేని ఓటర్ల జాబితాకు కృషి



కార్యక్రమంలో మాట్లాడుతున్న లక్ష్మీశివజ్యోతి

నల్లజర్ల: తప్పులు లేని ఓటర్ల జాబితా రూపకల్పనకు సమష్టి కృషి చేయాలని, ఓటర్ల నమోదు, సవరణల కోసం అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు బీఎల్వోలు క్షేత్ర స్థాయిలో విచారణ చేయాలని గోపాలపురం నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ లక్ష్మీ శివజ్యోతి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం సచివాలయ సిబ్బంది, బీఎల్వోలతో ఆమె సమావేశమయ్యారు. తుది ఓటర్ల జాబితా విడుదలైన తర్వాత స్వీకరించిన దరఖాస్తులపై సమీక్షించారు. కొత్తగా ఓటరు నమోదుకు అందిన ఫారం-6, ఫారం-7, ఫారం-8, 8ఏలను బీఎల్వోలు కచ్చితంగా క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. తగిన ధ్రువీకరణ పత్రాలు, సంతకాలు తీసుకొని ఆమోదం, తిరస్కరణ కోసం సూపర్‌వైజర్ అధికారులకు సమర్పించాలన్నారు. బీఎల్వోలు దరఖాస్తులను సూపర్‌వైజర్లు జాగ్రత్తగా తనిఖీ చేయాలన్నారు. దీనిలో ఎలాంటి పొరపాట్లు లేకుండా అప్‌లోడ్ చేయాలనిసెక్టార్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లకు సూచించారు. సమావేశంలో తహసీల్దారు పి.కృష్ణారావు, డిప్యూటీ తహసీల్దారు కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

గగన్ సందేశ్ మృతి బాధాకరం

తాళ్లపూడి: గ్రామానికి చెందిన బాలుడు కొట్రా గగన్ సందేశ్ మృతి బాధాకరమన్నారు. గగన్ గోపాలపురం సమీపంలో చెరువులో పడి మృత్యువాత పడిన నేపథ్యంలో సమాచారం తెలుసుకున్న కొవ్వూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు బుధవారం బాలుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, సంతాపం తెలిపారు. ఆయన వెంట ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, వైఎస్సార్ సీపీ జిల్లా గ్రీవెన్స్ సెల్ కన్వీనర్ గూడా విజయరాజు, వైస్ఎంపీపీ కోదాటి కనకయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

చాగల్లు: ఎస్.ముప్పవరంలో సర్పంచ్ ముప్పిడి మహాలక్ష్మి కుటుంబ సభ్యులైన మంగ ఇటీవల మృతి చెందారు. బుధవారం ఎమ్మెల్యే, కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముప్పిడి మంగ చిత్రపటానికి పూలమాలవేసి ఆయన నివాళులర్పించారు. ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.